

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

విజయనగరం
జిల్లా వార్తలు
శుక్రవారం 25 ఏప్రిల్ 2025

పీఏసీఎస్‌ను సందర్శించిన జేసీ

నెల్లిమర్ల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పూర్తిస్థాయిలో కంప్యూటరైజేషన్ జరిగిన నెల్లిమర్ల మండలం సతివాడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) కార్యాలయాన్ని జేసీ సేథుమాధవన్ గురువారం సందర్శించారు. కార్యాలయ సిబ్బందితోనూ, డీసీసీబీ జిల్లా అధికారులతోనూ మాట్లాడారు. సొసైటీలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీల గురించి, ఆర్థిక అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపైనా అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీసీసీబీ సీఈవో సీహెచ్.ఉమామహేశ్వరరావు, డీజీఎం ప్రసాద్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పులికొండపై తిష్ఠ

- ప్రభుత్వ భూమిని చదును చేసి ఆక్రమించేసిన వ్యక్తులు
- గత ప్రభుత్వంలో కీలక నేతల అండ
- నాడు రెవెన్యూశాఖ బోర్డులను సైతం పీకేసిన వైనం
- దర్జాగా కొబ్బరి మొక్కల సాగు


కోనయ్యపాలెంలో ప్రభుత్వ భూమి ఆక్రమించి నాటిన కొబ్బరి మొక్కలు

పూసపాటిరేగ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): చౌడవాడ పంచాయతీ పరిధిలోని కోనయ్యపాలెంలో ఉన్న పులికొండను ఆక్రమించేశారు. కొండపోరంబోకు భూమి కదా... ఎవరు ప్రశ్నిస్తారులే అనుకుని సొంతం చేసుకున్నారు. గత ప్రభుత్వంలో ఉన్న కీలక నాయకుల అండతో అప్పట్లోనే ఇందుకు తెగపడ్డారు. ఫిర్యాదు రావడంతో అధికారులు పరిశీలించి ఆ భూమి ప్రభుత్వానికి చెందినదని, ఆక్రమించరాదని బోర్డు పెట్టారు. అయినా ఏమాత్రం జంకు గొంకు లేని ఆ వ్యక్తులు బోర్డు పీకేసి దర్జాగా తిష్టవేశారు. నేతల నుంచి ఫోన్‌లు రావడంతో అధికారులు ఆ తర్వాత అటువైపు చూడడం మానుకున్నారు.

చౌడవాడ పంచాయతీలోని కోనయ్యపాలెం గ్రామంలో రెండు కొండలు విస్తరించి ఉన్నాయి. పది ఎకరాలకు పైగా కొండపోరంబోకు భూమిగా ఉండడంతో మూడేళ్ల కిందటి వరకు ఎవరూ అటువైపు చూడలేదు. అయితే సొంత ఇల్లు లేని స్థానిక పేదలు కొందరు కొండ దిగువ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని రంగంలోకి దిగిన ఆక్రమణదారులు నాలుగు ఎకరాల్లో ఉన్న కొండను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని ఎత్తుగడ వేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కీలక నేతల అండ తీసుకున్నారు. ఇంకేముంది సర్వే నెంబరు 17లోని పులికొండలో సుమారు నాలుగు ఎకరాల కొండ పోరంబోకు భూమిని చదును చేసి ఆక్రమించారు. ఎవరైనా ప్రశ్నిస్తే ముందు ఇళ్లను తొలగించండి ఆ తర్వాత ఆక్రమణల సంగతి చూద్దామనేవారు. దీనిపై మీడియాలోనూ అనేక కథనాలు రావడంతో నాటి రెవెన్యూ అధికారులు ఆ ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. ఈ కొండ ప్రభుత్వానికి చెందినదని, ఆక్రమించకూడదని బోర్డులు పెట్టారు. అయితే ఆక్రమణదారులు ఏమాత్రం తగ్గకపోగా పట్టు బిగించి కీలక నేతలను ప్రసన్నం చేసుకున్నారు. వారి చేత ఫోన్‌లు చేయించి అధికారులపై ఒత్తిడి పెంచారు. ఈ తలనొప్పి తమకెందుకు అనుకున్నారేమో ఆ తర్వాత అధికారులు అటువైపు చూడలేదు. ఇక కబ్జాదారులు సొంత స్థలంగా భావించుకుని కొబ్బరి తోట వేశారు. నేటికీ ఆ భూమి వారి ఆధీనంలోనే ఉంది. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారు. ఇదే విషయమై తహసీల్దారు గోవింద్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

రండి.. చేరండి

- జిల్లా వ్యాప్తంగా అడ్మిషన్ల డ్రైవ్
- ఇంటింటికీ వెళ్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు
- పాఠశాలల్లో చేరేలా తల్లిదండ్రులకు అవగాహన


రాజాం: గురవాంలో అడ్మిషన్ల డ్రైవ్ చేస్తున్న ఎంఈవో ప్రవీణ్‌కుమార్, సిబ్బంది

తల్లిదండ్రులారా ఒక్కసారి ఆలోచించండి.. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి.. ఉచితంగా దుస్తులు, మధ్యాహ్న భోజనం, షూలు, పుస్తకాలు పొందండి.. ఆహ్లాదకర వాతావరణంలో ఆధునిక సాంకేతిక విద్యను అభ్యసించేలా చూడండి.. ఆర్భాటపు ప్రకటనలు, అందమైన పాంప్లెట్లు చూసి ప్రైవేటు మోజులో పడకండి.. డబ్బు వృథా చేసుకోకండి.. అంటూ ఉపాధ్యాయులు కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తిచేసుకున్న చిన్నారులతో పాటు మధ్యలో బడి మానేసిన వారిని గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచిస్తున్నారు. తద్వారా విద్యార్థులకు సమకూరే ప్రయోజనాల గురించి వివరిస్తున్నారు.

రాజాం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల డ్రైవ్ ప్రక్రియ సాగుతోంది. సమగ్ర శిక్ష అధికారులు, ఉపాధ్యాయులు బృందాలుగా ఏర్పడి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకూ 4 వేల మంది చిన్నారుల తల్లిదండ్రులను కలిసినట్టు అధికారులు చెబుతున్నారు. మధ్యలో బడి మానేసిన వారిని కూడా కలిసి అవగాహన కల్పిస్తున్నారు. పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలు, అందిస్తున్న పథకాల గురించి వివరించి ప్రవేశాలను ప్రోత్సహిస్తున్నారు. గ్రామాల్లో ర్యాలీల ద్వారా కూడా అవగాహన కల్పిస్తున్నారు.

వైసీపీ పాలనలో పాఠశాల

(మిగతా 8వ పేజీలో..)


వేపాడలో ఉపాధి పనుల వద్దకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు(ఫైల్)

తల్లిదండ్రుల నుంచి విశేష ఆదరణ

జిల్లా వ్యాప్తంగా అడ్మిషన్ల డ్రైవ్ కొనసాగుతోంది. ముందుగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. సమగ్ర శిక్ష అధికారులు, సిబ్బంది, విద్యాశాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తల్లిదండ్రుల నుంచి సానుకూలత ఉంది. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

- మాణిక్యంనాయుడు, డీఈవో, విజయనగరం

పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

- అధికారులతో డీఆర్‌వో శ్రీనివాసమూర్తి
- ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌ఈఐ ప్రవేశ పరీక్షలపై సమీక్ష

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌ఈఐ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రవేశ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌వో శ్రీనివాసమూర్తి సూచించారు. శుక్రవారం జరిగే ఈ పరీక్షలపై గురువారం సమీక్షించారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టుమెంటల్ అధికారులతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఏపీఆర్‌ఈఐ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 5,6,7,8 తరగతుల ప్రవేశానికి 25న ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ జిల్లాలో ఆరు కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష కోసం 1287 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని చెప్పారు. అలాగే ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్‌డీసీల్లో ప్రవేశ కోసం మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకూ 10 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న డీఆర్‌వో శ్రీనివాసమూర్తి

ఏపీఆర్‌జేసీ కోసం 10 కేంద్రాల్లో 2104 మంది అభ్యర్థులు, ఏపీఆర్‌డీసీ కోసం 77 మంది అభ్యర్థులు పోటీ పడనున్నారు. పరీక్ష కేంద్రంలోకి ఇన్విజిలేటర్లు, అభ్యర్థులు కూడా మొబైల్ ఫోన్లను అనుమతించకూడదని తెలిపారు. సమావేశంలో డీఈవో మాణిక్యంనాయుడు, పరీక్షల సహాయ కమిషనర్ తిరుమలరాజు సన్యాసిరాజు ఉన్నారు.

కొత్త చిక్కులు

- స్లాట్ బుకింగ్‌లో మొదలైన అవస్థలు
- ఆగిపోతున్న సర్వర్
- పూర్తిగా అవగాహనకు రాని సిబ్బంది
- క్రయ, విక్రయదారుల్లో అసహనం

రిజిస్ట్రేషన్ సేవలు మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టం (డీక్యూఎంఎస్)లో కొత్త చిక్కులు వచ్చాయి. ఈ విధానంలో స్లాట్‌బుకింగ్ (అపాయింట్‌మెంట్) సదుపాయం కల్పించినప్పటికీ ఎప్పటికప్పుడు సర్వర్ ఆగిపోతోంది. దీనివల్ల అనుకున్న సంఖ్యలో రిజిస్ట్రేషన్‌లు జరగడం లేదు. స్లాట్ బుకింగ్ సమయానికి కక్షిదారులు కార్యాలయంలో ఉండాలి. లేకుంటే తీవ్రమైన జాప్యం జరుగుతోంది. నూతన విధానంపై సిబ్బందిలోనూ పూర్తిస్థాయిలో అవగాహన రాలేదన్న విమర్శ ఉంది.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

గజపతినగరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఇప్పటివరకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లోకి వెళ్లి వారు నిర్దేశించిన సమయానికి రిజిస్ట్రేషన్ స్లాట్ తీసుకుని ఆ సమయానికి వెళ్లాల్సి వచ్చేది. ఈ ప్రక్రియలో క్రయవిక్రయదారులు గంటల తరబడి నిరీక్షించేవారు. అదే సమయంలో దళారులు, లేఖర్లపై ఎక్కువ మంది ఆధారపడేవారు. ఈ పరిస్థితికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం స్లాట్ బుకింగ్‌ను తీసుకొచ్చింది. దీనిపై సమగ్ర అవగాహన రాకపోవడంతో ఇటు సిబ్బంది, అటు క్రయవిక్రయదారుల్లో అసహనం నెలకొంటోంది. గత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల కోసం 2.0 విధానం తీసుకొచ్చింది. అనేక మంది ఈ విధానాన్ని వ్యతిరేకించారు. ఇబ్బందులు ఇంకా కొనసాగుతున్నాయని భావించిన ఈ ప్రభుత్వం స్లాట్‌బుకింగ్‌ను తీసుకొచ్చింది. మొదటిదశలో జిల్లా కేంద్రంలోని రిజిస్ట్రార్ కార్యాలయాలకు వర్తింపజేసింది. తరువాత ఈనెల 21నుంచి మిగిలిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా అమల్లోకి తీసుకొచ్చింది. ఉదయం 10-30 గంటల నుంచి సాయంత్రం 5-30 గంటల వరకు స్లాట్ బుక్ చేసుకోవచ్చు. మెసేజ్ రూపంలో ఇచ్చే సమయాన్ని బట్టి రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయి. కొత్త విధానంతో క్రయ విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు 39 స్లాట్ బుకింగ్‌లకు రిజిస్ట్రేషన్‌లు కావాలని లక్ష్యం కాగా సర్వర్ సమస్యతో కొన్నే జరుగుతున్నాయి. సిబ్బందికే పూర్తి అవగాహన లేనప్పుడు కక్షిదారులకు ఎలా అర్థమవుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


రిజిస్ట్రేషన్ల కోసం నిరీక్షిస్తున్న క్రయ, విక్రయదారులు (ఫైల్)


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

ప్రణాళికతో ముందుకెళ్లాలి

- ప్రతి అధికారికీ లక్ష్యం ఉండాలి
- స్వర్ణాంధ్ర 2047 సాధన దిశగా పనిచేయాలి
- కలెక్టర్ అంబేడ్కర్

గజపతినగరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అధికారులు, సిబ్బంది ప్రణాళికతో ముందుకెళ్లాలని, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యసాధన దిశగా పని చేయాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని సమావేశ మందిరంలో గజపతినగరం నియోజకవర్గ అధికారులకు స్వర్ణాంధ్ర 2047పై గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులు ప్రణాళికలు రూపొందించుకొని వాటిని అమలు చేయాలన్నారు. జీడీపీ, జీవీఏ ఆధారంగా ప్రజల జీవన ప్రమాణాలు లెక్కిస్తారని, 15శాతం జీడీపీ సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారని గుర్తుచేశారు. తద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ఆదాయ వనరులు పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. జిల్లాలో 3 లక్షల వ్యవసాయ భూమి ఉండగా లక్షా 23వేల ఎకరాల్లో మాత్రమే సాగు కొనసాగుతోందన్నారు. మిగతా భూముల్లోనూ వ్యవసాయం చేస్తే ఆర్థిక వృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. అధికారులు మేధస్సుకు పదును పెట్టి కొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. మన జిల్లా మిగతా జిల్లాలకు ఆదర్శంగా మారాలని ఆకాంక్షించారు. వృథాగా ఉన్న చెరువుల్లో చేపలపెంపకం చేపట్టాలన్నారు. సేవారంగం అభివృద్ధిలో జిల్లాలో విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. భోగాపురం విమానాశ్రయం ఏర్పాటు అయితే ఈరంగంలో అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. సమావేశంలో వ్యవసాయశాఖ జేడీ వీటీ రామారావు, పశుసంవర్థశాఖ జేడీ డాక్టర్ వై.వి.రమణ, హార్టీకల్చర్ డీడీ జమదాగ్ని, మత్స్యశాఖ ఇన్‌చార్జి డీడీ విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జిల్లాలో ఏడు ఎయిడెడ్ పాఠశాలలు మూతపడనున్నాయి. జిల్లాలో 40 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్న ఎయిడెడ్ పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఆయా యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పంపిన యుడైస్ నివేదికలనే అధికారులు ప్రాతిపదికగా తీసుకున్నారు. 40 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్న పాఠశాలలు ఏడు ఉన్నట్లు గుర్తించారు.



పిల్లలకు వేసవి సెలవులు ఇచ్చేయడంతో విరామ సమయంలో వారికి ఏం నేర్పించాలి.. దేంట్లో శిక్షణ ఇప్పించాలి.. అనేదానిపైనే తల్లిదండ్రులంతా దృష్టి పెట్టారు. పిల్లలు నచ్చిన వ్యాపకాల్లో గడుపుతూనే ఆసక్తికర అంశాల గురించి ఆలోచించేలా చూడాలని వివిధ రంగాల నిపుణులు సూచిస్తున్నారు. అభిరుచులకు పదును పెట్టేందుకు వినియోగించుకోవాలని చెబుతున్నారు. టీవీలు, సెల్‌ఫోన్లను పరిమితికి మించి చూడొద్దంటున్నారు.




కొత్తబాటలు వేసుకుందాం

- వేసవి సెలవుల సద్వినియోగంపై దృష్టి పెట్టాలి
- అభిరుచులకు కార్యరూపమివ్వాలి
- సెల్‌ఫోన్లతో కాలక్షేపం వద్దు
- టీవీలకు అతుక్కుపోతే సమస్యే

విజయనగరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):

వేసవి సెలవులు వచ్చేశాయి. జూన్ 11వ తేదీ వరకు సెలవులు ఉంటాయి. జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభమవుతాయి. వేసవి విరామంలో వారికి నచ్చిన వ్యాపకాల్లో గడుపుతూనే పిల్లలు ఆసక్తికరమైన అంశాలపై దృష్టి సారించి.. కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివిధ రంగాల నిపుణులు సూచిస్తున్నారు. అభిరుచులకు పదును పెట్టేందుకు వినియోగించుకోవాలని చెబుతున్నారు. తద్వారా అటు సెలవుల్లో హాయిగా గడుపుతూనే... కొత్త అంశాలు నేర్చుకునే అవకాశం కలుగుతుందని అంటున్నారు. టీవీలు, సెల్ ఫోన్లను పరిమితికి మించి చూడొద్దని సూచిస్తున్నారు. దీని వల్ల అనేక శారీరక, మానసిక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

అబాకస్ నేర్చుకుంటూ..

విద్యార్థులు కష్టంగా భావించే గణితాన్ని ఇష్టంగా నేర్చుకొనేందుకు ఇదే సరైన సమయం. చైనీస్ టెక్నిక్ అయిన అబాకస్‌ను ప్రత్యేక శిక్షణ ద్వారా నేర్చుకోవచ్చు. లాజికల్ రీజనింగ్, ఐఐటీ గణితం, షార్ట్‌కట్, టెక్నిక్స్ వంటివి ప్రత్యేక అధ్యయనం ద్వారా సాధిస్తున్నారు. ఏకాగ్రత, వేగంగా కచ్చితమైన లెక్కలను, న్యూమరికల్ ఎబిలిటీ వంటివి అబాకస్ ద్వారా నేర్చుకోవచ్చు.

ఆంగ్లంలో ప్రావీణ్యానికి..

ప్రస్తుతం ఇంగ్లీషు నేర్చుకోవడం తప్పనిసరి. విద్యార్థి దశలోనే ఇంగ్లీషుపై పట్టుసాధిస్తే అన్ని విధాలా ప్రయోజనం ఉంటుంది. స్పీకింగ్ స్కిల్స్, గ్రామర్, వివిధ భాషల అనువాదంపై శిక్షణ పొందడం ద్వారా ఉపయోగం ఉంటుంది.

గ్రంథాలయాలకు వెళ్తూ..

పుస్తక పఠనం వల్ల ఎంతో ప్రయోజనం ఉంది. విద్యార్థుల్లో చదివే సామర్థ్యాన్ని పెంచాలి. విజ్ఞాన, వినోద, క్రీడలకు సంబంధించిన విషయాలు తెలుసుకొనేలా గ్రంథాలయాలు ఉపయోగపడతాయి. గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలను తెలుసుకోవడం ద్వారా స్ఫూర్తి పొందే అవకాశం ఉంది. గ్రంథాలయాల్లో వేసవి సెలవుల్లో పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు.

సామాజిక అంశాలపై ...


విద్యార్థి దశలోనే సామాజిక సేవలపై దృష్టి సారించాలి. స్నేహితులతో కలిసి సేవా కార్యక్రమాల నిర్వహణలో భాగస్వామ్యం కావాలి. వేసవి సెలవుల్లో చలివేంద్రాల వద్ద తాగునీరు అందిస్తూ, స్వచ్ఛ భారత్ తదితర కార్యక్రమాల్లో పాల్గొంటే మంచిది.

ఉన్నత చదువులపై దృష్టి..

వేసవి సెలవుల్లో వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యేలా సాధన చేయడం మంచిది. విద్యార్థి స్థాయి మేరకు ప్రిపేర్ కావాలి. దీనికి కోచింగ్ సెంటర్లలో కూడా శిక్షణ ఇస్తున్నారు. ఇందుకను గుణంగా శిక్షణ పొందడం వల్ల సత్ఫలితాలు సాధించవచ్చు.

కళల సాధనలో..

విద్యార్థులకు ఒక్కొక్కరికీ ఒక్కో అభిరుచి ఉంటుంది. నృత్యం, సంగీతం, జానపదులు, కరాటే తదితర వాటిపై ఆసక్తి చూపుతారు. వారి ఆసక్తి మేరకు వేసవి శిబిరాల్లో సాధన చేయిస్తే ప్రయోజనం ఉంటుంది.



మంచి దస్తూరి కోసం..

విద్యార్థులు మంచి మార్కులు సాధించాలంటే మంచి దస్తూరి కీలకం. ప్రత్యేక కాలిగ్రఫీ, ఇటాలిక్, ఇంగ్లీష్ దస్తూరి కోసం ప్రత్యేక శిక్షణ అవసరం. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో దస్తూరి కోసం సాధన చేస్తే మంచిది. మంచి మార్కుల కోసం చేతి రాతను అభివృద్ధి చేసుకోవడం అవసరం.

చిత్రలేఖనంలో..

కొంతమంది చిన్నప్పటి నుంచి చిత్రలేఖనంపై దృష్టి సారిస్తున్నారు. దానికి మరింత పదును పెడితే అద్భుతంగా రాణించవచ్చు. సృజనాత్మకతను చాటుతూ చిత్రలేఖనం సాధన చేయడం వల్ల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది.




కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ..

నేటి పిల్లల్లో కంప్యూటర్ అంటే తెలియనివారు ఉండరు. అప్‌డేట్ అవుతున్న కంప్యూటర్ కోర్సులను యువత తెలుసుకోవడం మంచిది. ముఖ్యంగా మల్టీమీడియా, డేటా, జావా, ఒరాకిల్, వెబ్ డిజైనింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ తదితర కోర్సులు నేర్చుకోవడం వల్ల ఉజ్వల భవితను పొందవచ్చు.

షట్టర్లు వేయరు.. సాగునీరు అందదు

- ఐడీ సాయన్న చానల్ దుస్థితి
- అన్నదాతలకు తప్పని అవస్థలు



సంకిలి తిరుగుడుపూని హెడ్ వద్ద పాడైన షట్టర్లు



చిట్టిగెడ్డ వద్ద రైతులు తాత్కాలిక అడ్డుకట్ట వేస్తున్న దృశ్యం (ఫైల్)

రేగిడి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రేగిడి, సంతకవిటి మండలాల ప్రధాన సాగునీటి వనరైన సాయన్న చానల్‌ను మెరుగుపరిచే అంశంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టడం లేదు. ఈ చానల్‌కు అవసరమైన చోట రెగ్యులేటర్ సిస్టమ్‌కు షట్టర్లు లేకపోవటం ప్రధాన సమస్య. రేగిడి, సంతకవిటి మండలాల్లో సాయన్న చానల్ పరిధిలో దాదాపు 12 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దీని హెడ్ రేగిడి మండలంలో ఉంది. ప్రధాన హెడ్ పాత చెలిగానవలసతో పాటు, రేగిడి, సంకిలిలో దీని హెడ్ రెగ్యులేటర్ వ్యవస్థలు ఉన్నాయి. దీని పరిధిలో పెద్దపూని, తిరుగుడుపూని, వృథా నీరు పోయేందుకు చిట్టిగెడ్డ రెగ్యులేటర్లు ఉన్నాయి. వీటికి బ్రిటిష్ కాలం నుంచి నాలుగైదు చోట్ల షట్టర్లు నిర్వహించే పరిస్థితి ఉండేది. వారబందీ ప్రకారం రేగిడి, సంతకవిటి మండలాల వారి పొలాలకు సాగునీరు కలిసేది. కాలక్రమంలో ఈ షట్టర్లు పూర్తిగా పాడయ్యాయి. దీంతో నీరు తిప్పుకొనేందుకు వీలు లేకుండా ఉంది. రైతులే స్వచ్ఛందంగా కర్రలు, చెక్కలు అడ్డుపెట్టి నీరు తిప్పుకొంటున్నారు. సంకిలి నీటి సంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావు ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌తో పాటు ఇరిగేషన్ ఉన్నతాధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చారు. అయినా ఫలితం కనిపించలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు సాయన్న చానల్ సమస్యపై దృష్టి పెట్టాలని ఈ ప్రాంత రైతన్నలు కోరుతున్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు అవసరం

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

బొబ్బిలి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తలసరి ఆదాయాన్ని 15 శాతానికి పెంచే విధంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ యంత్రాంగానికి సూచించారు. స్వర్ణాంధ్ర విజన్ ప్లాన్‌పై గురువారం బొబ్బిలిలో నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికార యంత్రాంగానికి ప్రాధాన్యతాంశాలపై దిశానిర్దేశం చేశారు. విజన్ ప్లాన్ అమలుకు సంబంధించి అవగాహన కల్పించారు. జిల్లా పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయం, అనుబంధ విభాగాలపై దృష్టి సారించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

వినియోగంలోకి తీసుకురావాలి..

జిల్లాలో వ్యవసాయ యోగ్యంగా సుమారు మూడు లక్షల ఎకరాల భూమి ఉందని కలెక్టర్ తెలిపారు. అయినప్పటికీ 1.80 లక్షల ఎకరాలు మాత్రమే సాగవుతోందన్నారు. మొత్తం భూమిని దశలవారీగా సాగులోకి తీసుకురావాలన్నారు. ప్రధాన పంటలు, అంతర్ పంటలను ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యాన, వాణిజ్య పంటల సాగును విస్తరింపజేయాలన్నారు. గుడ్లు, పాలు, మాంసం ఉత్పత్తుల పెంపుపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. సేవారంగంలో కూడా జిల్లాలో విస్తృత అవకాశాలున్నాయని ఆయన చెప్పారు. భోగాపురం విమానాశ్రయం ఏర్పాటైతే ఆ రంగంలో అవకాశాలు పెరుగుతాయన్నారు. గ్రామ స్థాయి పరిస్థితులను, వనరులను పూర్తిగా అధ్యయనం చేసి వాటికి తగ్గట్టుగా ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. తొలుత జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.బాలాజీ మాట్లాడుతూ విజన్ ప్లాన్ లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ వీటీ రామారావు, పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ వైవీ రమణ, ఉద్యానవన శాఖ డీడీ ఏవీఎస్‌వీ జమదగ్ని, ఏపీఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ, మత్స్యశాఖ ఇన్‌చార్జి డీడీ విజయకృష్ణ, ప్రత్యేకాధికారి నూకరాజు, ఆర్డీఓ జేవీఎస్ఎస్ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించి, రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేశారు.

జగన్ దొంగని చెబుతున్నది వారే

- మంత్రి సంధ్యారాణి

సాలూరు/పాచిపెంట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దొంగ అని ఏ2 నిందితుడు విజయసాయి రెడ్డే చెబుతున్నారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పాచిపెంట మండలంలోని మిర్తివలస, కొత్తవలస గ్రామాల్లో ఆమె గురువారం పర్యటించారు. అనంతరం సమీపంలో ఉన్న పామాయిల్ తోటలో మండలానికి చెందిన టీడీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తప్పులు చేసినవారు విజయవాడ, హైదారాబాద్ ఆసుపత్రుల్లో చేరి వైద్యం చేయించుకుంటున్నారని... కొంతమంది రాష్ట్రం విడిచి వెళ్లి పోయారని ఎద్దేవా చేశారు. ఎన్నో తప్పులు చేసిన ఐపీఎస్ అధికారి సీతారామంజనేయులును న్యాయస్థానం విడిచిపెట్టడం లేదని అన్నారు. రోజాతో పాటు వైసీపీ నాయకులు 'ఆడుదాం ఆంధ్ర'లో భారీ కుంభకోణానికి పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. జీవో నెం.3ను చంపేసింది వైసీపీ ప్రభుత్వమేనని అన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి యుగంధర్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పిన్నింటి ఈశ్వరరావు, మాదిరెడ్డి తులసిరామ్, తొత్తల సత్యవతి, కొరిపిల్లి సురేష్, ఎంపీటీసీ ఉమా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

ఘనంగా ముడుపుల పూజలు

సీతానగరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సువర్ణముఖి నది పక్కన గల వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గురువారం భక్తులు ముడుపుల పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ 27సార్లు ప్రదక్షిణ చేసి... ముడుపుల పూజలు చేస్తే సమస్యలు పరిష్కారమవుతాయని భక్తుల నమ్మకం. దీనికి అనుగుణంగా భారీ స్థాయిలో ముడుపులు చెల్లించారు. ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహ స్వామిని పూలతో అలంకరించిన దృశ్యం





పిరిడి గ్రామంలోని వ్యవసాయ బావిలో...

జలకాలాటలలో..

బొబ్బిలి/రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భానుడు భగభగమంటున్నాడు. నిప్పులు కురిపిస్తున్నాడు. ఆ వేడిని తట్టుకోలేక జనం తల్లడిల్లిపోతున్నారు. ఎండకు భయపడి జనం బయటకు రావడానికే వెనుకడుగు వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు... ముఖ్యంగా యువత ఎండల నుంచి ఉపశమనానికి చెరువులు, వాగులు, వ్యవసాయ బావుల్లో ఈత కొడుతూ సరదాగా గడుపుతున్నారు. బొబ్బిలి మండలం పిరిడి, గొర్లెసీతారాంపురం గ్రామాలలోని వ్యవసాయ బావుల వద్ద యువతతో సందడి సందడిగా ఉంటోంది.



ఎయిడెడ్ పాఠశాలలకు గండం!

- జిల్లాలో 7 చోట్ల మూసివేతకు రంగం సిద్ధం
- యాజమాన్యాలకు నోటీసులు
- విద్యార్థులు తక్కువగా ఉండడమే కారణం

నెల్లిమర్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ పాఠశాలలకు మూసివేత గండం తప్పేలా లేదు. విజయనగరం జిల్లాలో 40 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్న ఎయిడెడ్ పాఠశాలల మూసివేతకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు సంబంధిత పాఠశాలల యాజమాన్యాలకు విద్యాశాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. కనీసం 40 మంది విద్యార్థులు ఉంటేనే వాటిని నడిపేందుకు అవకాశం ఇవ్వాలని విద్యాశాఖ రాష్ట్ర స్థాయి అధికారులు నిర్ణయించారు. 2024-25 విద్యా సంవత్సరంలో సంబంధి త పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పంపిన యుడైస్ నివేదికలనే అధికారులు ప్రాతిపదికగా తీసుకున్నారు. ఈ మేరకు 40 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్న పాఠశాలలు జిల్లాలో ఏడు ఉన్నట్లు గుర్తించారు.



నెల్లిమర్లలో మూతపడనున్న ఎన్‌జేఎం ఎయిడెడ్ పాఠశాల

ఎక్కడెక్కడివి అంటే...

భోగాపురం మండలం కె.చెరకుపల్లి, బొబ్బిలి మండలం అలజంగి, మెరకముడిదాం మండలం గర్భాంలోని సీబీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలకు మూసివేతకు రంగం సిద్ధమైంది. నెల్లిమర్లలోని కొండపేటలో ఉన్న ఎన్‌జేఎం, రామభద్రపురం మండలం ఆరికితోటలో ఉన్న సీబీఎం, వంగర మండలం మగ్గూరులో ఉన్న ఎయిడెడ్, జిల్లా కేంద్రం విజయనగరంలో ఉన్న సీబీఎం ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలు మూసివేత జాబితాలో ఉన్నాయి. యూడైస్ నివేదికల ప్రకారం గడిచిన విద్యా సంవత్సరంలో చెరుకుపల్లి పాఠశాలలో 22 మంది విద్యార్థులు, అలజంగిలో 13 మంది, గర్భాంలో నలుగురు, నెల్లిమర్లలో 13 మంది, ఆరికితోటలో 12 మంది, మగ్గూరులో 29 మంది, విజయనగరం పాఠశాలలో 17 మంది ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. విద్యాశాఖ అధికారులు ఈ పాఠశాలల యాజమాన్యాలను అప్రమత్తం చేసినప్పటికీ గత మూడేళ్లుగా వాటిలో విద్యార్థుల సంఖ్య పెంపుదలలో ఎలాంటి పురోగతి కనిపించలేదని అధికారులు ఆ నోటీసుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యం నాయుడు ఆదేశాల మేరకు సంబంధిత మండల విద్యాశాఖాధికారులు ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలకు ఇప్పటికే నోటీసులు పంపించారు. దీంతో ఉలిక్కిపడిన యాజమాన్యాలు తమ పాఠశాలలను వచ్చే విద్యా సంవత్సరం కూడా కొనసాగించాలని కోరుతూ వినతులు ఇస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవలసి ఉంది.

విద్యార్థుల పరిస్థితి ఏంటి?

ఎయిడెడ్ పాఠశాలల భవనాలు, ఇతర స్టేషనరీ సంబంధిత యాజమాన్యాల సొంత ఆస్తులై ఉంటాయి. ఆ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం కొన్ని సంవత్సరాలుగా జీతాలు చెల్లి స్తోంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న కారణంతో ఆ 7 పాఠశాలలను మూసివేస్తే... ఉపాధ్యాయులను మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో సర్దుబాటు చేసే వీలుంది. ఆ ఉపాధ్యాయులకు ఉద్యోగ పరంగా స్థలం, యాజమాన్యం మార్పు తప్ప ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇప్పటికే వాటిలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా మారనుంది. వీరంతా సుదూరంలో ఉన్న ఇతర పాఠశాలలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటుందా? లేకపోతే సంబంధిత యాజమాన్యాల వినతులను పరిగణనలోకి తీసుకుంటుందా అనేది చూడాలి.

అధికారుల ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం..

విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో తక్కువ విద్యార్థులు ఉన్న ఎయిడెడ్ పాఠశాలలకు నోటీసులు జారీ చేశాం. వారి నుంచి వివరణ తీసుకున్నాం. కొన్ని యాజమాన్యాల నుంచి పాఠశాలలు కొనసాగించాలని వినతులు కూడా వచ్చాయి. ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వారి ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

-మాణిక్యంనాయుడు, డీఈఓ

భూ సేకరణకు నోటిఫికేషన్ విడుదల

వేపాడ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకవలస శివారు మారిక గిరిజన గ్రామంలో రైవాడ ఓపెన్ లూప్ పంపింగ్ స్టోరేజ్ ప్రాజెక్టు కోసం అవసరమైన భూ సేకరణకు కలెక్టర్ అంబేడ్కర్ నోటిఫికేషన్ జారీచేశారు. సంబంధిత నోటిఫికేషన్ ప్రతులను మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు జె.రాములమ్మ గురువారం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఖలీద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

భోగాపురం సీఐగా దుర్గాప్రసాద్

భోగాపురం, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): భోగాపురం సీఐగా కె.దుర్గాప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ భోగాపురం పరిధిలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చర్యలు చేపడతానన్నారు.

గజపతినగరం ఎస్ఐగా కిరణ్‌కుమార్ నాయుడు

గజపతినగరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం ఎస్ఐగా కె.కిరణ్‌కుమార్ నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం స్పెషల్ బ్రాంచ్ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

రేగిడి ఎఫ్ఏసీ తహసీల్దారుగా ఈశ్వరరావు

రేగిడి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రేగిడి మండలం ఎఫ్ఏసీ తహసీల్దారుగా ఈశ్వరరావు నియమితులయ్యారు. ఇక్కడ ఎఫ్ఏసీ తహసీల్దారుగా చేస్తున్న చిన్నారావు తహసీల్దారుగా పదోన్నతితో బదిలీ అయ్యారు. దాంతో రీసర్వే డీటీగా కొనసాగుతున్న ఈశ్వరరావుకు ఎఫ్ఏసీ తహసీల్దారుగా అధికారులు బాధ్యతలు అప్పగించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వంగర, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మడ్డువలస విద్యుత్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు నేపథ్యంలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు బాగెమ్మపేట, నీలయ్యవలస, శ్రీహరిపురం, పటువర్ధనం, బలిజిపేట మండలంలోని గలావల్లి, గేదెలపేటతో పాటు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఏఈ సురేష్‌బాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు స్వర్ణాంధ్ర విజన్‌పై అవగాహన

రాజాం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాలకొండ రోడ్డులోని ఎస్-ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు స్వర్ణాంధ్ర విజన్ 2047పై నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సు కలెక్టర్ అంబేద్కర్ అధ్యక్షతన జరుగుతుందని పేర్కొన్నారు. నాలుగు మండలాల అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

అనుమతుల లైసెన్స్ జారీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల,ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నగర పంచాయతీలో భవన నిర్మాణాల అనుమతులు జారీ చేసేందుకు లైసెన్స్ పొందేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎ.తారక్‌నాథ్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించవచ్చునని పేర్కొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

రాజాం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని మెంతిపేట బాలభవన్‌లో వేసవి శిక్షణ శిబిరాన్ని స్థానిక రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులు మే 31 వరకు కొనసాగుతాయని బాలభవన్ డైరెక్టర్ సుంకరి రమేష్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పీవీఎల్ రత్నం (సంగీతం), వి.ప్రసన్న(చిత్రలేఖనం). డ్యాన్స్ వి.తారకరామారావు (నృత్యం), గుణరాజశేఖర్ (తబలా) టీచర్లు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా డీఆర్వోకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలోని సీఐటీయూ నాయకులు కె.సురేష్, రమణ తదితరులున్నారు.

కొనసాగుతున్న ఆందోళన

కొత్తవలస, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని అప్పన్నపాలెం పంచాయతీ జిందాల్‌నగర్‌లో ఉన్న జేఎస్ఎల్ కర్మాగారం ఎదుట గురువారం కార్మికులు ఆందోళన కొనసాగించారు. ఇప్పటికే ఎమ్మెల్యే కోళ్లలలిత కుమారి, జేసీలను కార్మిక సంఘ నాయకులు కలిశారు. కర్మాగారం అక్రమ లాకౌట్‌పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలు అందజేశారు.

పేదలకు దుస్తుల పంపిణీ

లక్కవరపుకోట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లేపల్లిలో సత్యసాయి ట్రస్టు ప్రతినిధులు గురువారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఎ.రమణమ్మ, నక్క రాజు, జి.త్రిమూర్తులు, లక్కోజు పవన్‌సాయి, కామాక్షి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా.. సాగని పనులు

● అధ్వానంగా బొడ్డవర-అమ్మపాలెం రోడ్డు ● కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడమే కారణం

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డవర-అమ్మపాలెం రోడ్డు దాదాపు పదేళ్లుగా అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుపై నడవడమూ కష్టమే. రహదారిని బాగుచేయాలని స్థానికులు ఎన్నోసార్లు పాలకులను కోరారు. ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించింది. రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసింది. రహదారి కష్టాలు తీరుతాయని అందరూ ఆశపడ్డారు. అయితే ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. గతంలో పలు అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లకు గతేడాది డిసెంబరు 10 నుంచి బిల్లులు రావడంలేదు. ఆ బిల్లుల చెల్లింపు ప్రభావం ఈ రోడ్డు నిర్మాణంపై పడింది. దాంతో 800 మీటర్ల రోడ్డు పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడంలేదు. ఇకనైనా పాలకులు స్పందించి రోడ్డు పనులకు ఏర్పాట్లు చేయాల్సి ఉంది.



అధ్వానంగా బొడ్డవర-అమ్మపాలెం రోడ్డు

ప్రజల అవసరాలు తీర్చడమే ధ్యేయం

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాలు తీర్చడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు అన్నారు. గురువారం నగరంలోని వి.టి.అగ్రహారం బీసీ కాలనీలో వాటర్ ట్యాంకు, పైప్‌లైన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే వి.టి.అగ్రహారం బీసీ కాలనీ ఏర్పాటైందన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి ఒక్కొక్కటి పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ యశస్వి, కమిషనర్ నల్లనయ్య, కార్పొరేటర్ కడియాల రామకృష్ణ, సహాయ కమిషనర్ అప్పలరాజు, టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, అనురాధ బేగం, కంది మురళీనాయుడు, కోండ్రు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజ్జీ స్టేడియంలో బాక్సింగ్ పోటీలు

విజయనగరం ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విజ్జీ స్టేడియంలో గురువారం బాలికల బాక్సింగ్ పోటీలను ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రారంభించారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 14 నుంచి 18 ఏళ్ల లోపు దాదాపు 100 మంది బాలికలు హాజరయ్యారు. ఇందులో విజయం సాధించిన క్రీడాకారులకు పతకాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక వికాసానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. విజయనగరంలో క్రీడా పోటీలు తరచూ నిర్వహించడం శుభపరిణామమన్నారు. స్పోర్ట్సు స్కూల్ తిరిగి విజయనగరానికి రానున్నదన్నారు. కార్యక్రమంలో జేసీ సేతు మాధవన్, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

గజపతిననగరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందేలా కృషి చేయనున్నట్టు జిల్లా సహకార అధికారి పి.రమేష్ అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని సహకార సంఘాల సేవలపై స్థానిక పీఏసీఎస్ కార్యాలయం నుంచి జాతీయ రహదారి మీదుగా నాలుగురోడ్ల జంక్షన్ వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులుకు రుణాలు మంజూరు చేయడంతో పాటు ధాన్యం, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేస్తున్నామన్నారు. ఎరువులు, విత్తనాలనూ అందజేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ఈ సేవలను మరింత విస్తృతం చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా డివిజనల్ సహకార అధికారి రామ్మూర్తి, గజపతిననగరం సబ్ డివిజనల్ సహకార అధికారి వాణిశైలజ, సీఈవో నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న అధికారులు

శ్మశానవాటికకు స్థలం ఇప్పించండి

చీపురుపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామాంజనేయ కాలనీకి సమీపంలో శ్మశానవాటికకు అవసరమైన స్థలం ఇప్పించాలని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన రామాంజనేయ కాలనీ శ్మశానవాటిక వద్ద విలేకరులతో మాట్లాడారు. చీపురుపల్లిలోని 17 సర్వే నెంబర్లలో 3.18 ఎకరాల స్థలంలో శ్మశానవాటిక ఉందన్నారు. అయితే దీంట్లో ఎక్కువ శాతం ఆక్రమణకు గురయ్యిందన్నారు. ప్రస్తుతం కేవలం 12 సెంట్లు మాత్రమే శ్మశానికి మిగిలిందన్నారు. పెరుగుతున్న అవసరాల దృష్ట్యా శ్మశానికి అదనంగా కనీసం మరో 20 సెంట్ల స్థలం అవసరమన్నారు. ఇక్కడున్న పరిస్థితులు పరిశీలించి ఆ 20 సెంట్ల స్థలాన్ని ఇప్పించాలని ఆయన రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు.



శ్మశానం వద్ద గద్దే బాబూరావు

పది వారాలుగా వేతనాలు లేవు

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పది వారాల వేతనాలను చెల్లించే ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజును మండలంలోని కొట్టాం ఉపాధి వేతనదారులు కోరారు. గురువారం మండలంలోని కొట్టాం, మామిడిపల్లి గ్రామాల్లో ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, అన్ని శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చెరువు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో తమసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో సతీశ్, జేఈ సత్యనారాయణ, గ్రామపెద్దలు సేనాపతి చంద్రరావు తదితరులున్నారు.



వేతనదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

6న డాక్ అదాలత్

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ సంబంధిత సమస్యలపై వినతుల స్వీకరణకు మే 6న డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు చీఫ్ పోస్టుమాస్టర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ ఫిర్యాదుల కవర్‌పై డాక్ అదాలత్ అని అసిస్టెంట్ డైరెక్టర్, చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం, విజయవాడకు మే 1లోపు చేరేలా పంపాలన్నారు. మే 6న ఉదయం 11 గంటలకు నేరుగా విజయవాడ సర్కిల్ కార్యాలయానికి హాజరు కావాలన్నారు. లేకుంటే వెబ్‌సైట్ లింక్ ద్వారా హాజరై సమస్యను వివరించవచ్చని పేర్కొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఎస్పీ అభినందనలు



విద్యార్థులతో కలిసి విక్టరీ చూపిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పోలీసు సంక్షేమ ఆంగ్ల పాఠశాలకు చెందిన విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించిన నేపథ్యంలో వారిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నామమాత్రపు ఫీజులతో పోలీసు సంక్షేమ ఆంగ్ల పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తున్నామన్నారు. ఈ ఏడాది ఇక్కడి పాఠశాల నుంచి 13 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు సౌమ్యలత, నాగేశ్వరరావు, ఆర్ఐలు గోపాలనాయుడు, రమేశ్‌కుమార్, టి.శ్రీనివాసరావు, హెచ్ఎం సంధ్య, స్కూల్ ఇన్‌చార్జి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఏజీఎం మృతి

● సెంచూరియన్ వర్సిటీలో విషాదచాయలు

పర్లాకిమిడి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో సెంచూరియన్ యూనివర్సిటీ అడ్మిషన్ జనరల్ మేనేజర్ (ఏజీఎం) ఫల్గుణరావు(50) దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే.. పర్లాకిమిడిలో గల సెంచూరియన్ యూనివర్సిటీలో క్యాంపస్ ఏజీఎంగా విధులు నిర్వహిస్తున్న ఫల్గుణరావు గురువారం భువనేశ్వర్‌లోని యూనివర్సిటీ ప్రధాన కార్యాలయంలో జరగుతున్న సమావేశంలో పాల్గొనేందుకు పర్లాకిమిడి నుంచి తన కారులో బయలుదేరారు. ఈ క్రమంలో బరంపురంలో తన వాహనానికి డ్రైవర్ పెట్రోల్ వేయిస్తున్నాడు. దీంతో ఫల్గుణరావు కారు దిగి నడుచుకుంటూ వెళ్తుండగా అటుగా వచ్చిన గుర్తుతెలియని కారు బలంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఫల్గుణరావును బరంపురంలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఫల్గుణరావుకు భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరికి ఇంకా వివాహనం కాలేదు. కాగా ఫల్గుణరావుది గజపతి జిల్లా కాటిపాక స్వగ్రామం. సెంచూరియన్ యూనివర్సిటీలో కొంత కాలంగా ఏజీఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఫల్గుణరావు మృతితో వర్సిటీలో విషాదచాయలు అలుముకున్నాయి. వర్సిటీ చైర్మన్ ముక్తీకాంత్ మిశ్రీ, వైస్ చైర్మన్ డీఎన్ రావు, రిజిస్ట్రార్ అనిత పాత్రో సంతాపం తెలిపారు. ఆయన మరణం సంస్థకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద విషయం తెలుసుకున్న పలాస పీఏసీఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ శ్రీధర్ మృతుడి స్వగ్రామానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. కార్పొరేట్ రిలేషన్స్ మేనేజర్ సౌమ్యమిశ్రా, అకౌంట్స్ మేనేజర్ మనోజ్ మహాపాత్రో, అధ్యాపకులు, విద్యార్థులు సంతాపం తెలిపారు.



ఫల్గుణరావు (ఫైల్)

ఇద్దరు సీఐల నియామకం

విజయనగరం క్రైమ్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్ పరిధిలో వీఆర్‌లో ఉన్న ఇద్దరు సీఐలను జిల్లాకు కేటాయిస్తూ డీఐజీ గోపీనాథ్ జట్టి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న బొడ్డేపల్లి సుధాకర్‌ను డీసీఆర్‌బీకి, కె.దుర్గాప్రసాద్‌ను భోగాపురం యూపీఎస్ స్టేషన్‌కు సీఐగా నియమించారు.

చురుగ్గా దేవదాయ భూముల గుర్తింపు

●'ఆంధ్రజ్యోతి' కథనంతో అధికారుల్లో కదలిక

శృంగవరపుకోట రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం కేశవ స్వామి ఆలయానికి సంబంధించిన భూముల గుర్తింపు పనిలో దేవదాయ అధికారులు పడ్డారు. 141 ఎకరాల దేవదాయ భూమిలో 'ఆ '47 ఎకరాలు ఏమైనట్టు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన నేపథ్యంలో దేవదాయశాఖ అధికారులు స్పందించారు. నియోజకవర్గంలో ఎన్ని దేవాలయాలు ఉన్నాయి? వాటికి ఎక్కడెక్కడ భూములు ఉన్నాయి? వాటికి శిస్తులు వసూలు చేస్తున్నారా? లేదా? ఎంత విస్తీర్ణం ఆక్రమణల్లో ఉందనే విషయంపై దేవదాయ శాఖ అధికారులు ఈవోల నుంచి నివేదిక కోరారు. దాంతో మండల పరిధిలోని సన్యాసయ్యపాలెం, కొట్టాం, ఎస్.కోట ఈవోలు దేవదాయ భూములను గుర్తిస్తున్నారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పర్యవేక్షణ చేస్తున్నారు. ఎస్.కోట దేవాలయాల సబ్ డివిజన్‌కు సంబంధించి 1300 ఎకరాలున్నాయి. వీటిలో అధిక భాగం ఆక్రమణల్లో ఉంది. దానిపై చాన్నాళ్లుగా జిల్లా దేవాదాయశాఖ పెద్దగా దృష్టి సారించిన దాఖాలాలు లేవు. అయితే 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కావడంతో అధికారుల్లో చలనం వచ్చింది. ఇప్పటికే కేశవస్వామి భూముల వివరాలు సేకరణలో ఉన్న అధికారులు ఇప్పుడు మిగతా భూముల వివరాల సేకరణలో పడ్డారు. భూముల ఆక్రమణల ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు నడుం బిగించారు. అదేవిదంగా కాగా, గతంలో వేలం నిర్వహించిన భూములు, వాటి ద్వారా వస్తున్న ఆదాయం వివరాలు నమోదు పనిలోపడ్డారు. ఇదే విషయంపై ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ దేవదాయశాఖ భూముల పరిరక్షణకు ఆదికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టారన్నారు. భూములను సర్వే చేయించడం, వాటికి పట్టాదారు పాసుపుస్తకాలు చేయించడం, వాటిని వేలం ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. వారంలోగా వంద ఎకరాల భూముల శిస్తుకు వేలం పాటలు నిర్వహిస్తామన్నారు.



బోర్డులను సిద్ధం చేసిన దేవదాయ అధికారులు

సర్పంచ్ మృతికి మాజీ ఎమ్మెల్యే సంతాపం

దత్తిరాజేరు, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో పెదమానాపురం సర్పంచ్ గోటివాడ దాసు మృతి చెందిన నేపథ్యంలో ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య గురువారం సందర్శించారు. పూలమాల వేసి సంతాపం తెలిపారు. దాసు కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట జడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి ఉన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

విజయనగరం రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని విజయనగరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఎంపీడీవో గంటా వెంకటరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు. ●నెల్లిమర్ల: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరం జడ్పీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో నెల్లిమర్ల ఎంపీడీవో కె.రామకృష్ణరాజు ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఎంపీడీవో రామకృష్ణరాజును సత్కరించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నెల్లిమర్ల ఈవోపీఆర్డీ శంకర్ జగన్నాథం, ఏవో సుదర్శనం, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆయన్ని అభినందించారు.



ఎంపీడీవోను సత్కరిస్తున్న జడ్పీ చైర్మన్

కొబ్బరి కాయలు కోడుతూ.. కాలికి తగిలి..

గరివిడి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలో శివరాం గ్రామానికి చెందిన కోరాడ రామస్వామి (50) కొబ్బరి చెట్టుపై గాయపడి గురువారం మృతి చెందాడు. రామస్వామి రైతుల దగ్గర కొబ్బరి కాయలు కొనుగోలు చేసి చీపురుపల్లి పట్టణంలో విక్రయిస్తుంటాడు. గురువారం ఉదయం చీపురువలస మండలం అర్థివలసలో కొబ్బరి చెట్టు ఎక్కి, కత్తితో కొబ్బరి కాయలు కోస్తున్నాడు. ఆ సమయంలో కత్తి జారి రామస్వామి కాలికి తగిలింది. దాంతో తీవ్రగాయమైంది. దాంతో ఒత్తిడికి గురైన రామస్వామి నెమ్మదిగా చెట్టు దిగిపోయాడు. ప్రమాదం గమనించిన స్థానికులు రామస్వామిని చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రామస్వామి మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. రామస్వామికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. రామస్వామి మృతితో శివరాంలో విషాద చాయలు అలముకున్నాయి.



రామస్వామి (ఫైల్)

చెరువులో పడి వృద్ధుడి మృతి

భోగాపురం, ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రపేటకు చెందిన ఎస్.రాజోడు(65) భోగాపురం గంగిరావి చెరువులో ప్రమాదవశాత్తు పడి బుధవారం మృతి చెందాడని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు. బ్యాంకు పనిపై భోగాపురం వచ్చిన ఆయన కాలకృత్యాలకు వెళ్లి చెరువు పడి మృతి చెందాడన్నారు. రాజోడు మృతిపై కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో..

రాజాం రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజాం-బొబ్బిలి రోడ్డులో ఫైర్ స్టేషన్ సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొబ్బిలిలోని సంఘవీధికి చెందిన పిట్టా రమేశ్ (40)మృతి చెందాడు. తెర్లాం మండలం ఎం.బూర్జవలసకు చెందిన ఇద్దరు యువకులు రాజాం నుంచి పెరుమాళి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఫైర్‌స్టేషన్ సమీపంలో ఆకస్మికంగా ద్విచక్రవాహనంతో రోడ్డెక్కాడు. దాంతో రాజాం నుంచి పెరుమాళి వైపు వెళ్తున్న వాహనం బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో రమేశ్‌తో పాటు మరో వ్యక్తి గాయపడ్డాడు. క్షతగాత్రులను రాజాం సామాజిక ఆసుపత్రిలో చేర్పించారు. రమేశ్ పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రమేశ్ గురువారం సాయంత్రం మృతి చెందాడు. ఇదే విషయాన్ని రాజాం టౌన్ సీఐ కె.అశోక్ కుమార్ వద్ద ప్రస్తావించగా ఎవ్వరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

లచ్చయ్యపేటలో మహిళ..

సీతానగరం /బొబ్బిలి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి-పార్వతీపురం రహదారిలో సీతానగరం మండలం లచ్చయ్యపేటదగ్గర గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొబ్బిలికి చెందిన పట్నాయకుని శ్రీదేవి(38) మృతి చెందారు. సీతానగరం ఎస్ఐ రాజేశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొబ్బిలి పట్టణంలోని మిలటరీ కాలనీకి చెందిన పట్నాయకుని అనిల్‌కుమార్ తన భార్య శ్రీదేవితో కలిసి గురువారం సీతానగరంలో ఆలయానికి మొక్కులు తీర్చుకునేందుకు బైకుపై బయలుదేరారు. లచ్చయ్యపేట దగ్గర వెనుక నుంచి వస్తున్న వాహనం అనిల్ నడుపుతున్న బైకును ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాదంలో శ్రీదేవికి బలమైన గాయాలయ్యాయి. బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. అనిల్‌కుమార్‌కు స్వల్పంగా గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతురాలు శ్రీదేవికి ఇద్దరు పిల్లలున్నారు. అనిల్‌కుమార్ బొబ్బిలి పట్టణంలో మందుల షాపు నిర్వహిస్తున్నారు. శ్రీదేవి మృతదేహానికి బొబ్బిలి సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని ఎస్ఐ రాజేశ్ తెలిపారు.

బైక్‌లు ఢీ: నలుగురికి గాయాలు

రేగిడి, ఏప్రిల్ 24,(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉంగరాడమెట్ట సమీపంలో గురువారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో నలుగురు గాయపడ్డారని ఎస్ఐ నీలావతి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. జి.సిగడాం మండలం నిద్దాం గ్రామానికి చెందిన పొందూరు పాపారావు, నాగళ్ల మురళి, యు.వెంకటరావు పాలకొండలో వంటపనికి వెళ్లి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో వీరఘట్టం మండలం తలగాం గ్రామానికి చెందిన సల్మాజీరావు రాజాం నుంచి పాలకొండ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఉంగరాడమెట్ట వద్ద ఆటోను ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొట్టాడన్నారు. ఈ ఘటనలో నలుగురూ గాయాలపాలయ్యారన్నారు. రాజాం కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

రణస్థలం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం పంచాయతీ పరిధి గొల్లపేటకు చెందిన ఆవాల భవాని హత్య కేసులో నిందితుడు కొండ వీర్రాజును గురువారం జేఆర్ పురం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను జేఆర్ పురం సీఐ ఎం.అవతారం వెల్లడించారు. వీర్రాజు స్వగ్రామం విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పెద్దనడిపల్లి. పైడిభీమవరంలోని ఓ హోటల్‌లో కొన్ని నెలల కిందటి వరకు పనిచేసేవాడు. అక్కడే ఆవాల భవానీతో వీర్రాజుకు పరిచయం అయింది. అదికాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం బయటపడితే ఇబ్బందులు పడాల్సి వస్తుందని భవాని గతకొద్ది రోజులుగా వీర్రాజుకు దూరంగా ఉంటుంది. దీంతో భవానీపై వీర్రాజు అనుమానం పెట్టుకున్నాడు. ఈక్రమంలో ఈనెల 19న పైడిభీమవరం జంక్షన్ సమీపంలోని ఓచెరువు వద్దకు భవానీని రప్పించాడు. వీరిమధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. పక్కాప్లాన్‌తో వచ్చి వీర్రాజు తనతో తెచ్చుకున్న చాక్‌తో భవానీ పీక కోసి పరారయ్యాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. నిందితుడు వీర్రాజును కమ్మసిగడాం జంక్షన్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. ఆయనతో ఎస్ఐ ఎస్.చిరంజీవి ఉన్నారు.

ఉగ్రదాడిపై ప్రజాసంఘాల ఖండన

విజయనగరం రింగురోడ్డు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడులను ప్రజాసంఘాల నాయకులు చోడి ఆదినారాయణ, దుర్గారావు ఖండించారు. గురువారం కలెక్టరేట్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై కర్కశంగా కాల్పులు జరిపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో మురళీ, సంతోష్, వినయ్‌బాబు ఉన్నారు.

క్షేత్ర సహాయకుల కార్యవర్గం ఎన్నిక

గుర్ల, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) క్షేత్ర సహాయకుల నూతన మండల నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. మండలంలోని 42 మంది క్షేత్ర సహాయకుల్లో మండల కమిటీ అధ్యక్షుడిగా రాంబాబును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నారాయణరావు, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ ఎన్నికయ్యారు.

రండి.. చేరండి

(ఐదో పేజీ తరువాయి)

విద్యాశాఖలో అస్తవ్యస్త పరిస్థితులు ఉండేవి. పూటకో జీవో, రోజుకో ఉత్తర్వుతో విద్యాశాఖను ఇబ్బందికర పరిస్థితిల్లో నెట్టింది. కూటమి సర్కారు వచ్చాక ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తోంది. పాత విధానంలోనే మండలానికి ఒక ఎంఈవోను పరిమితం చేయాలని భావిస్తోంది. ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు కీలక బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. గతం మాదిరిగా స్కూల్ కాంప్లెక్స్‌లను మరింత బలోపేతం చేయాలనుకుంటోంది. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌లో 50 మంది ఉపాధ్యాయులు ఉండేలా చూడాలనుకుంటున్నారు. ఇప్పటివరకూ ప్రతి మండలంలో 10 నుంచి 12 వరకూ స్కూల్ కాంప్లెక్సులుండేవి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వాటి సంఖ్య సగానికి తగ్గే అవకాశం ఉంది.

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 1702 ఉండగా 1,13,424 మంది చదువుతున్నారు. 1 నుంచి 5వ తరగతి వరకూ 46,965 మంది, 6 నుంచి 10 వరకూ 66,459 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులు లేరన్న సాకు చూపి వందలాది పాఠశాలలను సమీప స్కూళ్లలో విలీనం చేశారు. పాఠశాలలతో పాటు తరగతులను వెనక్కి రప్పించే ఏర్పాటులో కూటమి ప్రభుత్వం ఉంది. ఈ విద్యాసంవత్సరం నాటికి ఈ ప్రక్రియ పూర్తిచేయనుంది. మరోవైపు ప్రభుత్వం ముందస్తుగా అడ్మిషన్ డ్రైవ్ పూర్తి చేయాలనుకోవడం విశేషం.

పశువుల అక్రమ రవాణాను అడ్డుకుందాం

● ఆర్డీవో రామ్మోహనరావు



డీఎస్పీ భవ్యతో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరిధిలో పశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని, అధికార యంత్రాంగమంతా కలిసికట్టుగా దీనికి అడ్డుకట్ట వేయాలని ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావు అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన జంతు సంక్షేమ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దత్తిరాజేరు మండలం పెదమానాపురంలో పశువుల సంత నిర్వహణకు లైసెన్స్ లేకపోయినప్పటికీ అక్కడ పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దేవాలయాలకు మూడు వందల మీటర్ల పరిధిలో ఎటువంటి జంతు బలులు జరగకుండా చూడాలని సూచించారు. వచ్చే నెల మొదటి వారంలో గొల్లపల్లి దాడితల్లి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో అక్కడ జంతు బలులు నిషేధం అన్న బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బొబ్బిలి డీఎస్పీ జి.భవ్య మాట్లాడుతూ పెదమానాపురం సంతకు ఒడిశా, పార్వతీపురం, పి.కోనవలస మీదుగా పశువుల అక్రమ రవాణా జరగకుండా తగిన నిఘా పెడతామని తెలిపారు. ఏపీ గోసంరక్షణ సమాఖ్య అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ మాట్లాడుతూ బొబ్బిలి డివిజన్‌లో పశువుల అక్రమ రవాణా చాలా జోరుగా జరుగుతున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిని అడ్డుకుని, రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేయాలన్నారు. గో సంరక్షణా శాలల ఏర్పాటు కోసం స్థలాలను కేటాయించాలని కోరారు. అనంతరం గోమాత గోసంరక్షణ సంస్థ రూపొందించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి పశు సంవర్థక శాఖ డీడీ ఎల్.విష్ణు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ లావణ్య, మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు ఉప్పాడ సోమేశ్వరరావు, మండల పరిషత్ ఏవో ఆర్‌వీఏ రావు, దత్తిరాజేరు మండల పంచాయతీ విస్తరణాధికారి వాణిశ్రీ, గోసంరక్షణ ప్రతినిధులు కేవీఆర్ సత్యనారాయణ, చింతల పూడి భూపతి, వి.ఝాన్సీ పాల్గొన్నారు.

37 జాబ్‌మేళాలు.. 4వేల ఉద్యోగాలు

● స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి ప్రశాంత్‌కుమార్

రామభద్రపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 37 జాబ్ మేళాలు నిర్వహించి 4వేల 130మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందని స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రానున్న రోజుల్లో జిల్లాలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో జాబ్‌మేళాలు నిర్వహించి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ప్రతి 3 నెలలకు 7 జాబ్ మేళాలు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో మెగా డ్రైవ్ నిర్వహించి 20 నుంచి 30 కంపెనీలు ఈ మేళాలో పాల్గొనే విధంగా చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే స్కిల్ హబ్స్ ద్వారా 676 మందికి జిల్లాలో ఇప్పటివరకు శిక్షణ ఇచ్చామని, వీరిలో 473 మందికి ప్లేస్‌మెంట్ కూడా కల్పించామని తెలిపారు. అలాగే జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతకు కంప్యూటర్స్, సర్వేయర్, టైలరింగ్, ప్యాబ్రికేషన్స్, ఎలక్ట్రికల్‌పై 3 నెలల పాటు ఉచితంగా ట్రైనింగ్ ఇచ్చి ప్లేస్‌మెంట్ కూడా ఇవ్వనున్నామని చెప్పారు. అలాగే ఇటీవల బొబ్బిలి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాలో 2 వేలమంది యువత పాల్గొన్నారని, వీరిలో 574 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు.

పైపులైనా ఇవ్వండి.. డబ్బులైనా ఇవ్వండి

రామభద్రపురం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): తనకు వ్యవసాయ పైపులైనా ఇవ్వండి లేదంటే తాను చెల్లించిన డబ్బులైనా ఇవ్వాలని మండల కేంద్రానికి చెందిన ఒక రైతు గత ఐదేళ్లుగా వ్యవసాయ కార్యాలయం చుట్టూ ప్రదక్షణ చేస్తున్నాడు. స్థానిక శ్రీరాంనగర్‌కు చెందిన చింతల ఆదినారాయణ 2019 జనవరి 30న వ్యవసాయ పైపుల కోసం రూ.10వేల 105లు డీడీ తీసి వ్యవసాయ కార్యాలయానికి ఇచ్చాడు. అయితే ఇప్పటివరకు సంబంధిత కంపెనీ నుంచి పైపులు రాలేదు. దీంతో ఆయన ఐదేళ్లగా వ్యవసాయ కార్యాలయం చుట్టూ ప్రదక్షణ చేస్తున్నాడు. ఈనేపథ్యంలో గురువారం స్థానిక మండల వ్యవసాయ కార్యాలయం వద్ద ఆందోళన చేశాడు. తాను కట్టిన డబ్బులైనా ఇవ్వండి.. పైపులైనా ఇవ్వండని డిమాండ్ చేశారు. ● దీనిపై మండల వ్యవసాయాధికారి వి.వెంకటయ్య మాట్లాడుతూ సంబంధిత కంపెనీకి గత వైసీపీ ప్రభుత్వం సబ్సిడీ చెల్లించకపోవడంతో ఆ కంపెనీ పైపులు విడుదల చేయలేదని తెలిపారు. ఇలా మండలంలో డీడీలు చెల్లించి పైపులు రాని రైతులు మరో పది మంది ఉన్నారని చెప్పారు. డీడీలు కట్టిన రైతులంతా సోమవారం జిల్లా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

బొబ్బిలిలో బ్యాంకర్ల సమావేశం

బొబ్బిలి రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జాయింట్ మండల లెవెల్ బ్యాంకింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎల్‌డీఎం రవణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో రామభద్రపురం, బొబ్బిలి మండలాల బ్యాంకర్లు, లైన్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో పాల్గొన్న బొబ్బిలి వెలుగు ఏపీఎం పి.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళా పొదుపు సంఘాలకు బ్యాంకు లింకేజీతో పాటు అంతర్గత అప్పులు ఇవ్వాలని కోరారు. ముద్ర, లఖపతి దీదీ తదితర రుణాలు మంజూరు చేయాలని కోరారు. నాబార్డు ఏజీఎం నాగార్జున, డీఆర్డీఏ ప్రతినిధి పీఎం రత్నాకర్, ఏసీ ఆదయ్య, వెలుగు, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవన విధానంలో మార్పు రావాలి

గరుగుబిల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జీవన విధానంలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి, శ్రీరామచంద్ర మిషన్ శిక్షకుడు జె.మురళి కోరారు. తోటపల్లిలో ఏర్పాటు చేసిన ధ్యాన కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ధ్యానంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జట్టు సంస్థ వ్యవస్థాపకుడు డా.డి.పారినాయుడు, అప్పలనాయుడు, శ్రీధర్‌నాయుడు, సోమశేఖరం తదితరులు పాల్గొన్నారు.

ముష్కరుల దాడి హేయమైన చర్య

● పహల్గాం ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ముష్కరులు దాడి చేయడం హేయమైన చర్య అని పలువురు అన్నారు. దాడికి నిరసనగా గురువారం ఉమ్మడి జిల్లాల్లోని పలుచోట్ల కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. పలువురు అధికారులు నల్ల బ్యాడ్జీలతో మానవహారంగా ఏర్పడ్డారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



బొబ్బిలి: గాంధీబొమ్మ సెంటరులో..



బెలగాం: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు



కురుపాం: జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో..



రామభద్రపురంలో మానవహారం



వేపాడలో..

జీడిపిక్కల కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి,
పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

గుమ్మలక్ష్మీపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జీడిపిక్కల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచించారు. మండలంలోని ఇరిడి గ్రామంలో వన్‌ధన్ వికాస కేంద్రం ద్వారా ఏర్పాటుచేసిన జీడిపిక్కల కొనుగోలు కేంద్రాన్ని ఆమె గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దళారుల బారిన పడకుండా ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వయంగా వీడీవీకే సభ్యుల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేస్తారని చెప్పారు. వీటి మద్దతు ధర కేజీ రూ.157 అని తెలిపారు. వన్‌ధన్ వికాస కేంద్రం ద్వారా లక్ష రూపాయలు విలువ చేసే టెంట్‌హౌస్ సామగ్రిని మహిళా సంఘ సభ్యులకు అందించామని చెప్పారు. అనంతరం గ్రామ ప్రజలు జగదీశ్వరికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రామకృష్ణ, జనసేన సమన్వయకర్త, ఇరిడి ఎంపీటీసీ కద్రక మల్లేశ్వరరావు, వీడీవీకే సభ్యుడు ఊరిశీ, నియోజకవర్గ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, నాయకులు వెంకటరావు, కొండలరావు, బుజ్జేశ్వరరావు, చిన్న లక్ష్మణరావు, అప్పలస్వామి, సీసీలు, వీవోఏలు, వీడీవీకే సభ్యులు, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డోకిశీలలో..

పార్వతీపురం రూరల్: మండలంలోని డోకిశీల గ్రామంలో గాంధీజీ వన్‌ధన్ వికాస్ కేంద్రంలో ఏర్పాటుచేసిన జీడిపిక్కల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఈ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్కెట్ యార్డులోనే ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అనంతరం గిరిజనులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టాపు వెంకట్‌నాయుడు, బోను చంద్రమౌళి, నీలాపు చంటి, నీలాపు కొండలరావు, వడ్డి చంటి, శ్రీదరపు రాజు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: జీడిపిక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

ప్రతిభను ప్రోత్సహిస్తాం

● ఎమ్మెల్యే విజయచంద్ర

బెలగాం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ గల విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 580పైగా మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు గురువారం పార్వతీపురంలోని ఓ ప్రైవేటు కల్యాణమండపంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని 580 పైగా మార్కులు సాధించిన 16 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే రూ.5వేలు చొప్పున తన సొంత సొమ్మును ప్రోత్సాహకంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పది పరీక్షల్లో జిల్లా మూడో సారి మొదటి స్థానం సాధించడం అభినందనీయం అన్నారు. ఇన్‌చార్జి డీఈవో రమాజ్యోతి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● భామిని: స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థి గౌడు జగదీష్ ఇటీవల వచ్చిన పదో తరగతి ఫలితాల్లో 590 మార్కులు సాధించి భామిని మండల టాపర్‌గా, జిల్లాలో మూడో స్థానంలో నిలవడంతో ఇన్‌చార్జి డీఈవో రమాజ్యోతి విద్యార్థికి వారి తల్లిదండ్రుల సమక్షంలో గురువారం సత్కరించారు. అత్యధిక మార్కులు రావడంతో పాటు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం వల్ల మోడల్ స్కూల్ ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు. ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్, అధ్యాపకులు చుక్కా సంతోష్‌కుమార్, గంజి నాగమణి పాల్గొన్నారు.



బెలగాం: విద్యార్థులతో ఎమ్మెల్యే విజయచంద్ర



భామిని: జగదీష్‌ను సత్కరిస్తున్న ఇన్‌చార్జి డీఈవో రమాజ్యోతి

వెల్ఫేర్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు

వీరఘట్టం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భామిని, సీతంపేట, పాలకొండ, వీరఘట్టం మండలాల్లో విధులు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు తమ సమస్యలు పరిష్కరించాలని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను కోరారు. ఈ మేరకు గురువారం వీరఘట్టంలోని తన నివాసంలో ఎమ్మెల్యేని కలిసి, వినతిపత్రం అందజేశారు. గౌరవ ప్రదమైన పేస్కేల్ అందించాలని కోరారు. వివిధ సంక్షేమ వసతిగృహాల్లో ఖాళీగా ఉన్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్-2 పోస్టులను వెల్ఫేర్లకు ప్రమోషన్ ఇచ్చి అందులో నియమించాలన్నారు. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకొని వెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు.

వీరఘట్టం పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చండి

వీరఘట్టం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంగా 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు ప్రదీప్‌కుమార్ ఎమ్మెల్యే జయకృష్ణను కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఎమ్మెల్యేని వీరఘట్టంలో తన నివాసంలో కలిసి, వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం రోగులు తాకిడి ఎక్కువగా ఉంటుందని, రోగులకు సరైన చికిత్స, మందులను అందజేయలే కపోతున్నామని వివరించారు. కమ్యూనిటీ ఆసుపత్రిగా మార్చినట్టయితే అదనపు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు వైద్యం అందేలా ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడి

సాలూరు రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సాలూరు మండలం సుల్లరి గ్రామ సమీప అడవుల్లో అక్రమంగా నిర్వహిస్తున్న సారా స్థావరాలపై గురువారం సాలూరు రూరల్ ఎస్ఐ నర్సింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో సారా బట్టిలో అప్పటికే తయారు చేసిన మూడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. తయారీకి సిద్ధం చేసిన ఎనిమి ది డ్రమ్ముల్లో 1800 లీటర్ల బెల్లంఊటను గుర్తించి, ధ్వంసం చేశారు. ఈ దాడిలో నింది తులెవ్వరు పట్టుబడలేదని, కేసు నమోదు చేసి తయారీదారులను గాలిస్తున్నామని సాలూరు రూరల్ ఎస్ఐ నర్సింహమూర్తి తెలిపారు.

20 లీటర్ల సారా స్వాధీనం

కురుపాం: కురుపాంలో ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. కురుపాంలో అక్రమంగా సారా అమ్ముతున్న ఆర్.ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేసి, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. సారా సరఫరా చేస్తున్న ఆర్.అప్పారావుపై కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ కార్డు కోసం
దరఖాస్తు చేసుకోండి

గరుగుబిల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సచి వాలయాల పరిధిలో అర్హులైన వృద్ధులు సీని యర్ సిటిజన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకో వాలని ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. ఆమె గురువారం స్థానిక విలేకర్లతో మాట్లాడా రు. వృద్ధులు సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలన అనంతరం సిటిజన్ కార్డు అందిస్తారని చెప్పారు. దరఖాస్తుతో పాటు పాస్‌ఫొటో, ఆధార్ జిరాక్స్ అందించాలన్నారు. ఆధార్ లింక్ అయిన ఫోన్‌ను తీసుకువెళ్లాల్సి ఉంటుందన్నారు. హౌస్‌హోల్డ్ సర్వే పూర్తయి ఉంటే అర్హులని తెలిపారు. కార్డు పొందేందుకు రూ.40 చెల్లించాలని ఆమె చెప్పారు.

గోతుల రహదారికి మోక్షం

వీరఘట్టం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వండువ జంక్షన్ నుంచి నవగాం జంక్షన్ వరకు ఉన్న సీపీఎస్ రహదారి గోతుల మయంగా మారింది. ఈ దారిలో నిత్యం ప్రమాదాలు సంభవిస్తునే ఉండేవి. ఈ రహదారి మరమ్మతులు గురువారం ప్రారంభించారు. సుమారు 3.7 కిలోమీటర్లు రహదారి మరమ్మతులకు రూ.కోటి 18 లక్షల నిధులు మంజూరయ్యాయని ఆర్‌అండ్‌బీ జేఈ టి.కిరణ్‌కుమార్ తెలిపారు. మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు.

రోహిత్‌కు అభినందన

పాలకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్దలి గ్రామానికి చెందిన పొగిరి వెంకటరమణ కుమారుడు పొగిరి రోహిత్‌కు జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా ర్యాంకు 903 వచ్చింది. ఈసందర్భంగా రోహిత్ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను వీరఘట్టం మండలం ఎం.రాజపురంలోని తన నివాసంలో కలిశారు. దీంతో ఆయన రోహిత్‌ను అభినందించారు. కూటమి నాయకు లు కర్నేన అప్పలనాయుడు, బొమ్మాళి సుధాకర్, వాకముడి అనీల్, ఉదయాన ఉదయ్‌భాస్కర్, మాచర్ల అనీల్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బోరుకు మరమ్మతులు

పాలకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఎస్‌కే రాజపురం గ్రామంలో మరమ్మతులకు గురైన ఓ బోరును ఎమ్మెల్యే జయకృష్ణ ఆదేశాల మేరకు అధికారులు గురువారం యుద్ధ ప్రాతిపదికన బాగుచేశారు. గ్రామంలో ఓ శుభకార్యానికి హాజరైన ఎమ్మెల్యేకు స్థానికులు కొత్త వీధిలో పాడైన బోరును చూపించారు. సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన ఆయన.. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించారు. వెంటనే సిబ్బంది వచ్చి బోరును బాగుచేశారు. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

నూర్పిడి యంత్రాల పరిశీలన

వీరఘట్టం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై ఆరు నూర్పిడి యంత్రాలు మంజూరయ్యాయి. కమిషనరేట్ నుంచి ఎన్‌వీ రమేష్, ఏవో శివరామకృష్ణ వచ్చి గురువారం ఈ యంత్రాల పనితీరును పరిశీలించారు. యు.వెంకంపేట, తలవరం, బిటివాడ, కిమ్మి గ్రామాల్లో సబ్సిడీ ద్వారా నూర్పు యంత్రాలు పొందిన రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. మండల వ్యవసాయశాఖాధికారి సౌజన్య, వ్యవసాయ విస్తరణాధికారి రాజేష్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నవగాం ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పనుకువలస, నవగాం, తుమరాడ, చింతాడ, అట్టలి, వాటపాగు, టీడీరాపురం, టీకేరాజపురం, ఎం.సింగుపురం, పొట్లి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని చెప్పారు.

ఖరాసవలస పంచాయతీకి పురస్కారం



జడ్పీ చైర్మన్ చేతులమీదుగా జ్ఞాపిక అందుకుంటున్న సర్పంచ్ లక్ష్మి

సాలూరు రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సాలూరు మండలం ఖరాసవలస పంచాయతీ ఉత్తమ పురస్కారానికి ఎంపికైంది. ఈ మేరకు గురువారం ఆ గ్రామ సర్పంచ్ ఒంటి లక్ష్మి, ఎంపీటీసీ అప్పికొండ రమాదేవి విజయనగరంలో జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతులమీదుగా జ్ఞాపిక, ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. వైస్ సర్పంచ్ యుగంధర్, పంచాయతీవాసులు హర్షం వ్యక్తం చేశారు.